


# పాడుడబ్బుకోసం పడరానిపాట్లు

జి.వి.జి

గిరికి ముచ్చెమటలు పోస్తున్నాయి.

తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నాడు. తన తండ్రి ఒకర్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడా? తనతండ్రికీ బుద్ధి ఎందుకు పుట్టింది

గిరిచేతుల్లో కంపిస్తోన్న ఉత్తరంలో ఇలా ఉంది

611, కొత్తతోట,
గుంటూరు.
5–8–1971

పానకాలుగారికి,

ఆ రహస్యం మీవద్ద ఉన్నంతవరకేగా మీరు నన్నిలా పదే పదే డబ్బుకోసం పీడించి, పిప్పి చేస్తూంటారు? ఏనాటికైనా ఆ రహస్యం బయటపడక తప్పదు. అప్పుడు నాకు జరగాల్సిన శాస్తి ఎటూ జరిగి తీరుతుంది. నేనిక గుండె దిటవుచేసుకొని, రాబోయే ఏ ఆపదనైనా ఎదుర్కోడానికి సిద్ధపడడమే తరువాయి.

కాని, ఆఖరుసారిగా అడుగుతున్నాను. మీ రడిగిన యాభై వేలూ ఇచ్చే స్థితిలోలేను. పదివేల రూపాయలకుపైగా ఒక్క ఎర్రని ఏగాని అయినా ఇచ్చే తాహత్తు నాకు లేదిప్పుడు. అంచేత, నన్ను కనికరించి, తమ అంగీకారాన్ని తెలియజేస్తూ వెంటనే ఉత్తరం రాయండి. మీ లేఖనే ఎదురు చూస్తూంటాను.


ఉత్తరం చివరన సంతకం లేదు. 'అహమ్మద్' అని మాత్రం టైప్‌చేయబడి ఉంది.

ఈ ప్రపంచంలో డబ్బు అనేది ఎంతపని చేయిస్తుంది? డబ్బుకోసం ఎందరు ఎంత నీచానికి పాల్పడతారు? ఇంతకీ, ఆ అహమ్మద్ ఎవరు? అతని ఏ రహస్యం తన తండ్రిగుప్పిట్లో ఉంది? ఎంతకాలంగా అతన్ని తన తండ్రి ఇలా బెదిరిస్తున్నాడు? తన తండ్రి ఇలాటివాడని తను కలలోనైనా ఎన్నడూ ఊహించలేదే! గిరిజ తనతండ్రికి ద్రోహం చేసి, ఆస్తిలో చాలాభాగం కాజేసినందువల్ల ఇప్పుడున్న డబ్బు చాలక తన తండ్రి ఈ అన్యాయానికి పూనుకున్నాడేమో!

ఐదేళ్ళక్రితం తన తండ్రి ఎలాంటి వాడు! ఎంతటి ఆస్తిపరుడు! కలప వ్యాపారంలో లక్షలు ఆర్జించాడు. అప్పుడు తన తల్లి చనిపోవడంతో ఈ గిరిజ అనే రాక్షసి తమ ఇంట్లో అడుగు పెట్టింది. తండ్రి ఆమెకు దాసానుదాసుడై, మంత్రముగ్ధుడిలా ఆమె చెప్పినట్లల్లా చేయసాగాడు. ఆఖరికి ఆమె మాటవిని, తనను ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు కూడా. క్రమక్రమంగా తాగుడుకు సైతం అలవాటుపడ్డాడు. కొంతకాలమయ్యాక కంపెనీని మూసేసి, సదా తప్పతాగుతూ, ఈ గిరిజ సేవలోనే మునిగిపోయాడు. ఎప్పుడో మంచి అదనుచూసి, ఆస్తిలో చాలా భాగాన్ని గిరిజ మెల్లగా తనపేర రాయించుకుంది. అప్పట్నించి ఆమె తన తండ్రిని హీనంగా చూడడం మొదలెట్టిందట. చివరికి తన తండ్రిని ఆవరించిన మైకం మెల్లమెల్లగాతొలగి, కనువిప్పు అయింది. గిరిజ కొంపలో కుక్కలా పడుండడానికి మనస్సొప్పక, తండ్రి బయటకు వచ్చేశాడు. ఈ దుస్థితికి దిగజారే వరకుగాని, తండ్రికి తను గుర్తుకు రాలేదు. అప్పుడు తెనాలిలో ఒక పొగాకు కొట్టులో టైపిస్టుగా పనిచేస్తున్నాడన్న సంగతి తన తండ్రికి ఎలాగో తెలిసి, పిలిపించాడు. క్షమించమని ఎంతగానో ప్రార్థించాడు.

చివరికి మిగిలిన ఒక చిన్న మేడను అమ్మి, ఆ డబ్బుతో మళ్ళీ కలప వ్యాపారాన్ని స్థాపించి, తండ్రి యధాప్రకారం వ్యాపార వ్యవహారాలు సాగిస్తున్నా డిప్పుడు. తను మునుపటిలాగే తండ్రికి అన్నివిధాలా చేదోడు వాదోడుగా ఉంటున్నాడు.

ఇప్పుడు కంపెనీని స్థాపించిన వేళా విశేషం కొద్దీ ఇప్పుడిప్పుడే కాస్త అభివృద్ధిలోకి వస్తోంది. బాంక్‌లో కొన్ని వందల నిలవఉంది. రెండుమాసాల



క్రితం తండ్రి యాభై వేలకు భీమా చేశాడు. ఇటీవలే ఒక చిన్న ఫియట్ కారును వాయిదాల పద్ధతిమీద కొన్నాడు కూడానూ.

ఇప్పుడేదో ఉన్నదానితో తృప్తిపడకుండా తన తండ్రికి ఈబుద్ధి ఏమిటి! గిరి బుర్ర వేడెక్కింది.

దాదాపు పక్షంరోజులుగా తన తండ్రి ప్రవర్తనలో ఏదో విచిత్రమైన మార్పు వచ్చింది. ఎందుకో అప్పుడప్పుడు ఏదో భయంతో పీడింపబడినవాడిలా అగుపిస్తున్నాడు. రెండుమూడుసార్లు గదిలో ఒంటరిగా కూర్చొని, ఆయన అదే పనిగా ఏడుస్తూండడం తను చూశాడు. అప్పుడొకసారి తను గదిలోకి వెళ్తే తనను పలకరించాడు కూడాను. "గిరీ, నీకు తీరని అన్యాయం చేశాను. కామాంధకారంలో కళ్ళుకానక, ఆస్తిని ఆ పిశాచి పాలు చేశాను. ఇప్పుడు మనమీ స్థితిలో ఉన్నాం. నా మూలంగా ఇప్పుడు నువ్వుకూడా కష్టాలు అనుభవిస్తున్నావు. నేను ఆ కొంపలో దిగబడకుండా ఉంటే, నీ చదువు ఎస్. ఎస్. ఎల్. సి. తోనే ఆగిపోయేదా? మీఅమ్మ మరణశయ్య మీదుండగా నిన్ను విదేశాలకు పంపిస్తానని మాటిచ్చాను..."

అంతే. ఆ తర్వాత మాట్లాడలేక పోయాడు తండ్రి. ఆ రోజు రాత్రంతా ఆయన నిద్రపోయినట్లులేదు. గదిలో కూర్చొని, ఏదో టైప్ చేస్తూండడం రాత్రి ఒంటి గంటవరకు గమనించాడు తను. ఆ మర్నాడు మంగళవారం 4 వ తారీఖు. ఒక కవర్‌ను చేతబట్టి, పోస్టు చేయడానికి తన తండ్రి స్వయంగా కాలినడకన వెళ్ళివచ్చాడు. ఆ సాయంత్రమే తన వద్దకు వచ్చి, "గిరీ, మన కాలం బాగోలేదు. ఏ రాత్రో నీ కోసం ఎవరైనా దొంగతనంగా ఇక్కడికి రావొచ్చు. ఎందుకో — నీకు తర్వాత చెప్తాను. అంచేత, నేను అప్పుడప్పుడు కొంతకాలంపాటు అజ్ఞాతవాసంలో గడపాలి. నువ్వు మాత్రం చాలా జాగ్రత్తగా ఉండు. రాత్రిళ్ళు పడుకోబోయే ముందు ఒకసారి తలుపులన్నీ భద్రంగా మూసి ఉన్నాయో - లేవో చూసి పడుకో. నే నింట్లోలేనని ఆ దుర్మార్గుడెవడికైనా తెలిశాక, ఆ కోపావేశంలో నీ ప్రాణం తీసినా తియొచ్చు. నీ దగ్గర మన పిస్టల్‌ను ఉంచుకొని పడుకోవడం ఎందుకైనా మంచిది ... నేనీ రాత్రి ఇక్కడ ఉండడం లేదు. వెళ్ళి, మళ్ళీ 6 వ తేదీ, గురువారం నాటి ఉదయం వస్తాను...ఇలా చూడు! ఈ విషయం గురించి నువ్వు ఎక్కువ శ్రద్ధాసక్తులు వహించి, నీ బుర్రను పాడుచేసుకోకు సుమా!" అనేసి వెళ్ళిపోయాడు.

గిరి మెదడులో మసలుతున్న పై ఆలోచనలన్నీ, బయట బూడ్సుల చప్పుడు వినబడడంతో అంతర్ధానమయ్యాయి. మరో క్షణంలో అతని తండ్రి పానకాలు ఆ గదిలోకి ప్రవేశించాడు.

"ఆ నీలి ఉత్తరమేమిటి? ఎప్పుడొచ్చింది? దాని కవర్‌ను ఎందుకు ఓపన్ చేశావు!" గావుకేకలెత్తూ పానకాలు గభాల్నవచ్చి, కొడుకు చేతనున్న ఆ ఉత్తరాన్ని లాక్కున్నాడు. "బుద్ధిలేదూ?" కోప్పడ్డాడు.

"క్షమించండి, నాన్నగారూ! ఇది మీ ఆంతరంగిక ఉత్తరమని నేనను కోలేదు."

"బుకాయించకు. కవర్ మీద 'ప్రైవేట్' అని రాసి ఉంటుంది. గమనించలేదూ?"

గిరి ఒంగి, చిత్తుకాగితాల బుట్టలో పడున్న ఓ కవర్‌ను చేతికి తీసుకొని చూశాడు. "పొరబాటయింది. నే నిది గమనించలేదు," అన్నాడు ఖిన్న వదనంతో.

"ఈ ఉత్తరాన్ని చదివావా?"

"అబ్బే—లేదండి. ఇప్పుడే కవర్‌ను చించి, ఉత్తరాన్ని బయటకు తీశానో లేదో-మీరూ వచ్చారు."

పానకాలు తీక్షణంగా చూస్తూ, "ఇటుపైన నా పేర వచ్చే ఏ కవర్‌నూ ఓపెన్ చెయ్యకు. తెలిసిందా?" అన్నాడు.

"అలాగే," అని తల ఊపాడు గిరి.

* * *

ఆవేళ మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో పానకాలు, కొడుకును పిలిచి, ఒక టెలిగ్రామ్ ఫారమ్ తెప్పిం

చాడు. దానిమీద ఏదో రాశాక తండ్రి హుటాహుటీగా కాలినడకన బయలు దేరడం గిరి గమనించాడు. తర్వాత మరో గంటలో ఆయన తిరిగి వచ్చాడు.

గదిలోకి వెళ్ళగానే కొడుకును పిలి పించి.."నీలో ఇంకా కుర్రతనంపోలేదు. ఈ బీరువా తాళాన్ని ఎలాగైనా తీసి, అందులోఉన్న నా పర్సనల్ ఫైల్‌ను చూడ్డానికి ఎన్నడూ ప్రయత్నించకు. అలాటి పిచ్చిపని ఏదైనా చేస్తే, మళ్ళీ నువ్వూ, నేనూ విడిపోవలసి వస్తుందేమో —జాగ్రత్త!" అన్నాడు.

"అలాగే" అని తలఊపాడు గిరి విస్మయంగా చూస్తూ.


"సరే...నే వెళ్తున్నా. మళ్ళీ 9వ తేదీ శనివారం ఉదయం వస్తా. నే చెప్పి నట్లు రాత్రిళ్ళు చాలా జాగ్రత్తగా ఉండు."

పానకాలు వెళ్ళిపోయాక గిరి హడా విడిగా కారులో తిన్నగా పోస్టాఫీస్‌కు బయలుదేరాడు. పోస్ట్‌మాస్టర్‌ను కలుసు కొని, "శ్రమ ఇస్తున్నందుకు క్షమిం చండి. దాదాపు ఓ అరగంట క్రితం మా నాన్నగారు ఒక టెలిగ్రామ్ ఇచ్చారట. అడ్రస్ సరిగ్గా రాశారో లేదో అని ఆయనకు అనుమానంగా ఉంది. అంచేత దయచేసి ఆ టెలిగ్రామ్ నకలును నాకో సారి చూపించగలరా?" అంటూ తన తండ్రిపేరు చెప్పాడు.

పోస్ట్‌మాస్టర్ అందించిన టెలిగ్రామ్ కాపీలో ఈ విధంగా ఆంగ్లంలో వుంది: "ఒకే మాట. యాభై వేలకు తక్కువ లాభంలేదు. 9 వ తేదీ వరకూ వ్యవధి ఇస్తున్నాను. ఆ రోజు నన్ను తప్ప కుండా కలుసుకోవాలి."

అహమ్మద్ పేర తన తండ్రి పంపిన ఆ టెలిగ్రామ్‌ను చదివాక, గిరి గుండెల్లో రైళ్ళు పరుగెత్తసాగాయి.

తన తండ్రి తత్త్వం తనకు తెలియ నిది కాదు. ఆయనకు ఎంతతోస్తే అంత,




ఇతరులెవ్వరూ ఎంత చెప్పినా వినిపించు కోడు. అంతటి పట్టుదలగల మనిషిచేత ఈ బ్లాక్‌మెయిలింగ్‌ను మాన్పించడం ఈ జన్మలో తన తరం కాదు.

ఇంతకీ, తన తండ్రి ఇలా ఆ అహమ్మద్‌ను ఎంతకాలం బెదిరిస్తాడు? ఆ అహమ్మద్ కూడా తన తండ్రికి మల్లె మొండిపట్టు పట్టేవాడిలాఉన్నాడు. వీళ్ళిద్దరికీ ఎప్పుడు ఏ ఒడంబడికయైనా కుదురుతుంది? అంతవరకు తన తండ్రి ఏ క్షణంలోనైనా తనని అహమ్మద్ హత్యచేయడానికి ప్రయత్నించవచ్చునని భయపడుతూ, అహమ్మద్ వద్దనించి ఉత్తరాలు వచ్చే రోజుల్లో మాత్రమే ఇంటికివచ్చి, తతిమ్మా సమయాలలో ఎక్కడో తలదాచుకుంటూంటాడా?... గిరి తల తిరిగిపోతోంది.

"అడ్రసు సరిగ్గా ఉందా?" ఉన్న ట్టుండి పోస్ట్‌మాస్టర్ అడిగాడు.

గిరి తృళ్ళిపడ్డాడు. వెంటనే తమా యించుకుంటూ, "ఆఁ... సరిగ్గానే ఉందండి"...అంటూ తన చేతనున్న కాగి తాన్ని పోస్ట్‌మాస్టర్‌కు ఇచ్చేసి, అక్క డ్నించి కదిలాడు.

* * *

9 వ తేదీ ఉదయం పానకాలు పది గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకునే సరికి, గిరి గదిలో కూర్చొని, అప్పుడే పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాలను చూస్తు న్నాడు. తండ్రిని చూడ్డంతోటే గిరి చివాలున లేచి, మేజా సొరుగులోంచి 'ప్రైవేట్' అని రాసిఉన్న ఓ కవర్‌ను అందించాడు. పానకాలు ఆ కవర్‌ను ఇటూ అటూ తిప్పిచూసి, పక్కగదిలోకి వెళ్ళాడు.

కాస్సేపయ్యాక బల్లమీదున్న టెలి ఫోన్ బెల్ మోగింది. గిరి రిసీవర్‌ను అందుకున్నాడు. ఫామిలీ డాక్టర్ సీతా రామయ్య తన తండ్రి కోసం ఫోన్ చేశాడు. "ఉండండి. నాన్నగార్ని పిలుస్తా" అంటూ గిరి పక్కగదిలోకి వెళ్ళి, పానకాలుతో ఆ విషయం చెప్పాడు.


"గిరి, నువ్విక్కడే ఉండు. నీతో ఒక ముఖ్యమైన విషయం గురించి మాట్లాడాలి. సీతారామయ్యగారితో మాట్లాడి వచ్చేస్తా" అంటూ పానకాలు టెలిఫోన్ ఉన్న గదిలోకి వెళ్ళాడు.

గిరి కళ్ళు మెల్లగా సోఫాపక్కన ఉత్తరంకేసి తిరిగాయి. చప్పున దాన్ని అందుకున్నాడు.

8–8–71

"పానకాలు గారికి...— నమస్తే.

7 వ తారీఖునాటి మీ టెలిగ్రామ్ అందింది. మీరుకోరినవిధంగా మిమ్మల్ని శనివారంనాడు కలుసుకోలేక పోతున్నం




దుకు క్షమించాలి. మా స్నేహితుడొకడి పద్ద కొన్నినగలు తాకట్టుపెట్టే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అతను ఆదివారం ఉదయానికిగాని పూర్తిగా డబ్బు ఇవ్వ లేనంటున్నాడు. అంచేత, ఆదివారంనాటి సాయంత్రమే ఆరు గంటల ప్రాంతంలో యాభై వేలతో మిమ్మల్ని కలుసు కుంటాను.

— అహమ్మద్."

ఈ ఉత్తరంలో కూడా చివరన సంతకం లేదు. పేరుతోసహా టైప్ చేయ బడి ఉంది.

చదివేశాక తటాలున ఆ ఉత్తరాన్ని సోఫాపక్కన యధాస్థానంలో ఉంచేసి, ఏమీ ఎరగనట్లు దూరంగా వచ్చి నిలు చున్నాడు గిరి.

మరో నిమిషంలో పానకాలు ఆ గదిలోకి ప్రవేశించి, కేలండర్‌వంక చూస్తూన్న గిరిని చూశాడు. వెంటనే సోఫా పక్కన తను పడేసిన ఉత్తరాన్ని చూశాడు. అది అక్కడే ఉండడంవల్ల దాన్ని తన కొడుకు చూసిఉండడని అనుకున్నాడు. మెల్లగా ఆ ఉత్తరాన్ని అందుకొని, పక్కజేబులో దాచు కున్నాడు. సోఫాలో ఉస్సూరుమని కూర్చుంటూ, "గిరీ! రేపే నువ్వు ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరాలి" అన్నాడు.

"రేపా!" గిరి తెల్లబోయాడు.

"అవును. మీ మామయ్యకు ఈవేళే ఉత్తరం రాసేస్తున్నాను," అని కాస్సే పాగి, తగ్గు స్థాయిలో పానకాలు ఇలా అన్నాడు: "ఇటీవల నాలో ఏదో మార్పును నువ్వు గమనిస్తూనే ఉండాలి. నా హృదయంలో శాంతి ఉండడంలేదు. ఇటుపైన నేనిక్కడ ఉండదలచలేదు. నా చేతులారా నిన్నో ఇంటివాణ్ణిగా చేసి, ఆ తర్వాత ఏ హృషీకేశ్‌కో వెళ్ళి పోయి, మిగతా జీవితాన్ని సన్యాసిగా, నిశ్చింతగా గడపాలని ఉంది. అప్పటికి గాని నా మనసులో ప్రశాంతత ఏర్ప డదు. అంచేత ఈ నెలాఖరులోగానే మాలతితో నీ పెళ్ళికి సర్వసన్నాహాలూ వెంటనే చేయించమని మీ మామయ్యకు ఉత్తరం రాస్తున్నాను. నువ్వు ముందు వెళ్ళి, ఢిల్లీలో ఉండు. రెండు మూడు రోజుల్లోగా నేనూ వస్తాను."

"నా పెళ్ళికి ఇప్పుడేం తొందర?" గిరి తలవొంచుకున్నాడు.

"వెధవా, నీ కెన్నిసార్లు చెప్పాలి— నా మాటకు ఎదురు చెప్పొద్దని? నా మీద నీకు గౌరవం లేదంటే చెప్పే సేయ్...ఇప్పుడే వెళ్ళిపోతాను."

"అంత కోపందేనికి నాన్నా! అలాగే వెళ్తాలే" అని నిట్టూరుస్తూ, గిరి అక్క డ్నించి వెళ్ళిపోయాడు.

*   *   *

పానకాలు హాలులో ఇటూ అటూ పచార్లుచేస్తున్నవాడల్లా నౌకరు వీరన్న రావడంచూసి, "ఏరా, అబ్బాయికి బండిలో సీటు దొరికిందా?" అన్నాడు.

"ఆఁ. దొరికిందండి," వీరన్న జవా బిచ్చాడు.

"సరే. నేను బయటకు వెళ్తున్నా గాని, ఇల్లు జాగ్రత్తగా చూసుకుం టూండు. సాయంత్రం ఆరు గంటల లోగా వస్తా. ఒకవేళ నేను రావడం ఆలస్యమైతే, ఆరు గంటల ప్రాంతంలో నా కోసం ఒకరు రావచ్చు. ఆయన్ని కూర్చోమని చెప్పు. నే వచ్చేవరకు ఆయన్ని వెళ్లొద్దని చెప్పి, నువ్వు హోటల్‌నించి రెండు కేరియర్లలో భోజనం తీసుకురా."

"రెండు కేరియర్లలోనా, బాబూ?" వీరన్న బుర్రగోక్కుంటూ అడిగాడు.

"నే చెప్పింది ఏ భాషలో?" పాన కాలు గుడ్లురిమాడు.

"అలాగే, బాబూ, అలాగే!" అని వీరన్న గుడ్లు మిటకరిస్తూ వెళ్ళి పోయాడు.

*   *   *

వీధిలో జట్కా ఆగిన చప్పుడువిని, వీరన్న ఉలిక్కిపడి లేచినిలుచున్నాడు. చుక్కల పుల్‌షర్టు, లుంగీ తొడుక్కొని ఉన్న ఓ గడ్డపు మనిషి జట్కాలోంచి దిగాడు. జట్కావాడికి డబ్బులిచ్చేశాక ఆ వ్యక్తి వీరన్నవంక చూశాడు..."పాన కాలుగారి ఇల్లు ఇదేనా?"

"చిత్తం, బాబయ్యా!"

"ఆయన ఉండారా?"

"ఇంకాస్సేపట్లో వచ్చేస్తారు. మీరు

లోపలికి వచ్చి కూర్చోండి," అంటూ ఆ ఆగంతకుని చేతనున్న సంచీని వీరన్న తీసుకోబోయాడు.

"సంచీ హుషార్. లోపల డబ్బు, మందుసీసాలు ఉన్నయ్."

వీరన్న ఆ సంచీని తీసుకెళ్ళి, హాలులో టేబుల్ మీద ఉంచాడు. అందులో ఏముందో చూడాలని వీరన్నకు చాలా ఆత్రుత కలిగింది. ఒకసారి వెనుతిరిగి చూశాడు. ఆ గడ్డపాయన హాలులో అటువైపున గోడలకున్న ఫొటోలవంక చూస్తున్నాడు. ఇదే మంచి సమయమని వీరన్న హఠాత్తుగా ఆ సంచీ తెరిచి చూచాడు. లోపల కొన్ని వందరూపాయల నోట్ల కట్టలు, రెండు మూడు బ్రాందీ సీసాలు కనిపించాయి.

'మందు సీసాలంటే నేను నమ్మేస్తాననుకున్నాడేమో ఈ తురకవాడు. ఇటువంటి బ్రాందీ బుడ్లను నే నెన్నిసార్లు దొంగతనంగా మా అయ్యగారికి తీసుకొచ్చి ఇవ్వలేదు?' అని వీరన్న తనలో తాను అనుకుంటూ, వంటింటివైపు నడిచాడు. కాస్సేపయ్యాక రెండు టిఫెన్ కేరియర్లను చెరోచేత పట్టుకొని, హాల్లోకి వచ్చాడు.

"పానకాలుగారు ఎపుడు వస్తారోయ్?" గడ్డపతను అడిగాడు.

"ఇంకో పది పదిహేను నిమిషాల్లో వచ్చేస్తారండి."

"అచ్చా! అట్లా అయితే నే యెల్లి వూరు సూసివస్తా."

"వద్దు బాబూ, వద్దు. మిమ్మల్ని ఎక్కడికీ వెళ్ళనీయవద్దన్నారు అయ్యగారు. మీరిక్కడే కూర్చొండి. నే వెళ్ళి హోటల్ నించి అన్నం తీసుకువస్తా."

"అచ్చా. జావ్. జల్దీ ఆవ్."

వీరన్న కేరియర్‌లను మోసుకొని బయలుదేరాడు.

* * *



మరో పావుగంటలో వీరన్న తిరిగి వచ్చాడు. వీధి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. హాల్లోకి వెళ్ళి చూస్తే, ఆ గడ్డపతను లేడు. "సార్, సార్?" అని పిలుస్తూ వీరన్న ఇల్లంతా తిరిగాడు. వీరన్న గుండె తారెత్తిపోయింది. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆ గడ్డపాయన వీధి తలుపులు బార్ల తెరిచి బయటకు ఎలా వెళ్ళిపోయాడు?

అయ్యగారు వచ్చాక ఆ గడ్డపాయన ఏడి అని అడిగితే? అతను వెళ్ళిపోయినందుకు తనమీద కేకలేస్తారేమో! వీరన్న నిలువునా కంపించిపోసాగాడు. హాల్లోనే టిఫిన్ కేరియర్‌లు ఉంచి, నెత్తి బాదుకుంటూ కూలబడిపోయాడు. అరగంట గడిచింది...ఏడుగంట లయింది... ఏడున్నర కూడా దాటింది. ఆరుగంటలకల్లా ఇంటికి చేరుకుంటానన్న అయ్యగారూ రాలేదు; చెప్పకుండా వెళ్లిపోయిన ఆ గడ్డపతనూ రాలేదు. వీరన్న బిక్కు బిక్కు మంటూ అలాగే కూర్చుండిపోయాడు.

* * *

పొగలు కక్కుతూ, చీకటిని చీల్చుకుంటూ, కోడెత్రాచులా పరుగెడుతోంది హౌరామెయిల్. ఆర్తనాదంలా అకస్మాత్తుగా ఇంజన్ కూతకూసింది. దాదాపు 400 అడుగుల దూరంలో లెవెల్

క్రాసింగ్‌వద్ద పట్టాలమీద ఒక కారు ఆగిఉండడం ఇంజన్ ముందున్న లైట్ వెలుగులో డ్రయివర్ చూశాడు. మళ్ళీ విజిల్ వేశాడు. అప్పటికీ ఆ కారు అలాగేఉంది. కదలలేదు. ఆ కారు ముందులైట్లు కూడా వేసినట్లులేదు. ఇంజన్ డ్రయివర్‌కు ఆశ్చర్యంవేసింది. ఆ కారును క్రమక్రమంగా ఇంజన్ సమీపిస్తోంది. హఠాత్తుగా డ్రయివర్ బ్రేక్ వేశాడు. కాని, అప్పటికే చాలా ఆలస్యమైంది. కారును ఒక్క తోపు తోసి, కొంతదూరం వెళ్లాక కాని ఇంజన్ ఆగలేదు. కారు కొన్ని ముక్కలై, కొద్ది దూరంలో చెల్లాచెదురుగా ఎగిరిపడడం ఆ ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తున్న కొందరికి మసక మసగ్గా కనిపించింది.

* * *

ఆ ఫియట్‌కారు వెనుకభాగం ముక్కలయింది. మర్నాటి ఉదయానికల్లా ఆ కారును లేవనెత్తి, దానికింద గుర్తుపట్టడానికి అలవికాకుండాఉన్న శవాన్ని బయటకు తీయించడం జరిగింది. ఆ కారు పానకాలుదనీ, శవం అతనిదేననీ తెలుసుకోడానికి అట్టేకాలం పట్టలేదు. మరణించడానికి ముందు పానకాలు బాగా తాగుడు మైకంలో పూర్తిగా తెలివి తప్పి ఉండాలనీ, ఇంజను ఆ కారును డీకొన్నప్పుడే అతను చనిపోయి ఉండాలనీ మార్చురీలో శవపరీక్ష మూలంగా తేలింది పైగా, కారును పరీక్ష చేశాక ఇంకో విశేషం కూడా బయటపడింది. ఇగ్నిషన్ కంట్రోల్ ఆపివేయబడిందని తేలింది. అంచేత స్విచ్‌లో కారుబీగం లేదు. శవం వొంటిమీదున్న షర్టుజేబులో కూడా బీగంలేదు. ఆ షర్టు చిరిగిఉంది. ఒకవేళ పానకాలు ఎందుకైనా ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నిస్తే, ఇగ్నిషన్ కంట్రోల్‌ను ఆపుచేసి బీగాన్ని బయటకు ఏందుకు తీసివేస్తాడు? ఇగ్నిషన్ కంట్రోలును ఆపుచేయనిదే బీగాన్ని తీయడానికి వీలుపడదు. అంచేత ఎవరో పానకాలుకు బ్రాండీ ఇచ్చి, అతను మంచి మైకంలో ఉన్నప్పుడు అతన్ని కారులో తీసుకువచ్చి, ఆ కారును లెవెల్ క్రాసింగ్‌వద్ద పట్టాల మీద నిలిపి, ఇగ్నిషన్ కంట్రోల్‌ను ఆపుచేసి, తర్వాత బీగాన్ని తీసుకొని పరారై ఉండాలి.

డిటెక్టివ్ చాణక్య కూడా సరిగ్గా ఇలాగే ఊహించాడు. పానకాలు ఇంట్లో పనిచేసే నౌకరు వీరన్న చెప్పిన విషయాలు చాణక్య మస్తిష్కానికి మరింత పని కలిగించాయి. సాయంత్రం ఆరు గంటల ప్రాంతాలలో తనకోసం ఎవరో వస్తారని క్రితంరోజు మధ్యాహ్నం పానకాలు చెప్పడమూ, అలాగే ఒక ముస్లింవ్యక్తి వచ్చి, తను రెండు కేరియర్లలో అన్నం తెచ్చేలోగానే పరారైపోవడమూ, తనయజమానీ, ఆ ముస్లింవ్యక్తీ ఇద్దరిలో ఏ ఒక్కరైనా తిరిగి రాకపోవడమూ గురించి వీరన్న వివరంగా చెప్పాడు. ఆ ముస్లిం తెచ్చిన సంచీలో వందరూపాయల నోట్లు కొన్నింటితోపాటు రెండు మూడు బ్రాండీ బుడ్లు ఉన్న విషయంగురించి కూడా వీరన్న తెలియజేశాడు.

క్రితంరోజు మధ్యాహన్నం పానకాలు కొడుకు గిరి ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి ప్రయాణమైనట్లు చాణక్య అంతకుముందే తెలుసుకున్నాడు. అంచేత ఆ సమయంలో ఆ ఎక్స్‌ప్రెస్ నాగపూర్ స్టేషన్‌లో ఆగిఉందని రైల్వే స్టేషన్‌లో వాకబుచేసి, కంట్రోల్ వారి సాయంతో టెలిఫోన్ మూలంగా గిరికి అతని తండ్రి మరణవార్తను గురించి తెలియజేసే ఏర్పాటు చేశాడు.

గిరిని కలుసుకున్నాక పానకాలు ఒక వ్యక్తిని బ్లాక్‌మెయిల్ చేసేవాడన్న సంగతి తెలిసి, చాణక్య ఆలోచనలు ఓ గట్టున పడ్డాయి. గదిలోని బీరువా తాళాన్ని తీసి, అందులోంచి పానకాలు పర్సనల్ ఫైల్‌ను బయటకు తీయించాడు చాణక్య. అందులోని కొన్ని ఉత్తరాలను పరిశీలించాడు.

చాణక్య వెనుక చేతులుకట్టుకొని విచారంగా నిలుచొని ఉన్న గిరి గద్గద స్వరంతో ఇలా చెప్పాడు: "నాన్నగారు ఇలా ఒకర్ని బ్లాక్‌మెయిల్ చేసే వారంటే, ఆయన్ని ఎరిగున్న వాళ్ళెవరూ అంత తేలికగా నమ్మరు. పరిస్థితులే ఆయన్ని అంత నీచానికి దిగజార్చాయి. అలా ఆ అహమ్మద్‌కు రాసిన ఉత్తరాలను నాన్నగారే స్వయంగా పోస్ట్ చేసేవారు. పైగా ఆ అహమ్మద్ తనను ఏ క్షణంలోనైనా హత్య చేస్తాడేమోనని ఆయన చాలా మొదట్నించీ భయపడేవారు. అంచేత అహమ్మద్‌కు రాసిన ఉత్తరాలను పోస్ట్ చేసిన వెంటనే ఆయన తలదాచుకోడానికి ఎక్కడికో వెళ్ళిపోయేవారు. మళ్ళీ అహమ్మద్ వద్దనించి జవాబు వచ్చేరోజునకాని ఇంటికి తిరిగివచ్చేవారుకాదు," అంటూ దాదాపు ఇరవై రోజులుగా తన తండ్రి ప్రవర్తనలో విచిత్రమైన మార్పులు వచ్చాయని విశదంగా వివరించాడు.

చాణక్య పైప్ వెలిగించి, ఆలోచించసాగాడు.

* * *

గుంటూరు కొత్తతోట ఎక్స్‌టెన్షన్‌లో 611 వ నెంబర్ ఇంటిముందు జీప్ ఆగింది. అందులోంచి చాణక్య, ఇన్‌స్పెక్టర్ జాకబ్, గిరి దిగారు. ఆ ఇంటికి తాళంవేసిఉంది. ఆ ఇల్లుగల ఆసామీ పక్క ఇంట్లోనే ఉన్నాడని తెలిసి, చాణక్య అతనికి కబురంపించాడు.

"ఆ అహమ్మద్‌ది ఏ ఊరో నాకు తెలియదండి. అతనిగురించి ఏ వివరాలూ అడగవద్దని అతను ముందుగానే నాతో అన్నాడు. 4వ తేదీ సాయంత్రం అతనీ ఇంట్లో ప్రవేశించాడు. అద్దె 50




రూపాయలు ముందే చెల్లించాడు. తను ఇంగ్లీషులో కథలు రాస్తూంటాననీ, ఒక చక్కని నవలను ఏకాంతంగా కూర్చొని రాయడానికి ఎవ్వరూ ఎరగని ఈ ప్రాంతానికి తాను వచ్చినట్లు చెప్పాడు. అతనితోపాటు ఒక సూట్‌కేస్‌ను, ఒక టైప్‌రైటింగ్ మెషిన్‌నూ తెచ్చుకున్నాడండి. కాని అతని వాలకం ఎందుకో విచిత్రంగా ఉండడంవల్ల మొదట్నించీ అతనిమీద నా కేదో అనుమానంగా ఉండేదండి. అతనీ ఇంట్లోఉండి, ఏ రచననూ సాగించినట్లు అనిపించదు. ఎంచేతంటే, అతను 6వ తేదీ ఉదయం పది గంటలవేళ మా ఇంటికివచ్చి, 'ఇక్కడెక్కడైనా సమీపంలో పోస్ట్‌బాక్స్ ఉందా?' అని అడిగాడు. ఎదురుగా సందు మలుపునఉన్న ఆ పోస్ట్‌బాక్స్‌ను చూపించాను. అతను వెళ్ళాడు. మళ్ళీ అతను ఇంటికి తిరిగివచ్చినట్లులేదు. 8వ తేదీ ఉదయం 9 గంటలవరకూ ఇంటికి తాళంవేసిఉంది. తర్వాత ఆ రోజు అతనెప్పుడు వచ్చాడో నాకు తెలీదు. ఆ వేళ మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో అతను ఒక కవర్‌ను చేతబట్టి, మళ్ళీ పోస్ట్‌బాక్స్ కేసి నడవడం చూశాను. అంతేనండి. ఆ తర్వాత అతను తిరిగి ఇక్కడికి చేరుకోలేదు. అప్పట్నించి ఈ ఇంటికి ఇలాగే తాళం వేసిఉంది." అన్నాడా ఇల్లుగల ఆసామీ.

"ఈ తాళానికి మారుబీగం మీ వద్ద ఉందా?" చాణక్య అడిగాడు.

"ఉందండి. అసలు ఆ తాళం నేనే ఇచ్చా," అంటూ ఆ ఆసామీ వెళ్ళి, ఒక బీగాలగుత్తిని తెచ్చాడు.

తాళం తీశాక, చాణక్య ఆ ఇంట్లోకి ప్రవేశించాడు. హాలులో ఏమీ లేదు. తలుపుచాటున ఒక పాత చెప్పుల జత మాత్రం ఉంది. ఆ హాలుకు అటువైపున ఉన్న ఒకే ఒక్క గదిలో ఓ టేబుల్ మీద బాగా పాతబడ్డ ఒక చిన్న పోర్టబుల్ టైప్‌రైటర్ ఉంది. ఆ టేబుల్‌కున్న రెండు సొరుగులూ చాణక్య లాగి చూశాడు. వాటిలో కొన్ని నీలిరంగు కాగితాలు, రెండుమూడు కవర్లు, కార్బన్ పేపర్లు తప్ప మరేమీలేవు. చాణక్య పైప్ వెలిగించాడు.

ఇంతలో ఒక మోటార్ సైకిల్ వేగంగావచ్చి, బయట వీధి గడప ముందు ఆగిన చప్పుడైంది. ఆ మోటార్ సైకిల్ మీదినించి ఒక కానిస్టేబుల్ దిగాడు. అతను జాకబ్‌కు ఒక సంచీని అందిస్తూ, ఏదో చెప్పాడు. వెంటనే జాకబ్ ఆ సంచీని తీసుకొని, , చాణక్య దగ్గరికి వచ్చాడు. ఆ సంచీలోంచి చుట్టగా చుట్టబడిఉన్న ఒక చిరిగిన చుక్కల చొక్కాను బయటకు తీసి చాణక్యకు అందిస్తూ, జాకబ్ ఇలా అన్నాడు.

"ఈ చిరిగినషర్టు ఆ కారు ప్రమాదం జరిగిన లెవెల్ క్రాసింగ్‌కు కొంత దూరంలో ఓ పొదవద్ద పడిఉందటండి. నిన్న సాయంత్రం ఆరుగంటలప్రాంతంలో పానకాలుగారిని కలుసుకోడానికి వచ్చిన ఆ అహమ్మద్ తొడుక్కొని ఉన్న షర్టు ఇదేనని నౌకరు వీరన్న గుర్తుపట్టాడట. ఈ సంచీకూడా ఆ గడ్డపు మనిషిదేనట. హతుని మీదున్న షర్టు బాగా చిరిగిఉండడం మీరుచూశారు. ఈ షర్టుకూడా చిరిగిఉంది. అంచేత పానకాలుగారు బాగా తప్పతాగి ఉన్నప్పుడో, లేక అంతకు ముందో—ఆయనా, ఆ ముస్లిమ్ వ్యక్తీ ఎందుకైనా పోట్లాడుకొని ఉండాలని తెలుస్తోంది. అంచేతనే తన వొంటిమీదున్న ఈ చిరిగిన షర్టును ఎవరైనా చూస్తే, తనను ఎందుకైనా అనుమానిస్తారేమోనని భయపడి, ఆ అహమ్మద్ ఈ షర్టును విప్పి, ఆ లెవెల్ క్రాసింగ్‌కు దూరంగా పొదలచాటున పడేసి, అక్కడ్నించి అతను పరారై ఉండాలి. అన్నట్టు — అసలు సంగతి చెప్పడం మరిచాను. ఆ షర్ట్ జేబులో పానకాలుగారి కారు బీగం ఉందటండి."

చాణక్య ఆ షర్టు జేబులోంచి బీగాన్ని బయటకు తీసి చూశాడు. తర్వాత తీక్షణంగా ఆలోచిస్తూ, ఆ షర్టును ఇటు అటు తిప్పిచూశాడు. ఉన్నట్టుండి ఆ షర్టులోపల ఉన్న వస్తువేదో చేతికి తగిలేసరికి చాణక్య ముఖం ప్రకాశవంతమైంది. "పానకాలుగారు హత్య చేయబడలేదు; ఆత్మహత్య చేసుకున్నారు," అన్న పల్కులు చాణక్య నోట్లోంచి అప్రయత్నంగా వెలువడ్డాయి.

"ఆఁ! ఆత్మహత్యా!" అన్నాడు గిరి విస్తుపోతూ.

"అవును. ఆత్మహత్యే ... దాదాపు ఇరవై రోజులుగా మీ తండ్రిగారు అంతర్గతంగా బాధపడ్తూన్న ఓవిషయం గురించి మీతో చెప్పకొని వాపోయారు. ఒక స్త్రీకి వశమైపోయి, ఆ స్త్రీలో చాలా భాగాన్ని ఆమెకు రాసిచ్చి, మీకు అన్యాయంచేసి, ఇప్పుడు మిమ్మల్నీస్థితికి తెచ్చినందుకు ఆయన చాలా పశ్చాత్తాపపడ్డారు. అందుకే మీకు కొంత డబ్బు చేకూరేటట్టు చేసి, తాను తప్పుకోవాలనుకున్నారు. రెండు మాసాలక్రితం ఆయన యాభై వేలకు భీమాచేశారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారని తెలిస్తే, ఆ భీమాడబ్బు మీకు రాదు. అందుకని తను హత్యచేయబడ్డాడని నిరూపించడానికే ఆయన మొదటినించీ ఆ అహమ్మద్ పాత్రను సృష్టించారు. మీ నాన్నగారే ఆ అహమ్మద్. ఆ పాత్రను ధరించి, ఆయన ఈ ఊళ్ళో ఈ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. దస్తూరీని పోలిస్తే తన పథకమంతా పాడవుతుందని టైప్‌రైటింగ్ మెషిన్‌తో కొన్ని ఉత్తరాలు సృష్టించారు. తను అహమ్మద్ అనే వ్యక్తిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లూ, ఆ వ్యక్తి తనను ఏ క్షణంలోనైనా హత్య చేయడానికి ప్రయత్నిస్తాడేమోనని తాను భయపడుతున్నట్లూ — మీకు చూచాయగా తెలిసేలాగున చేశారు. సాధారణంగా బ్లాక్‌మెయిల్ చేసేవాడెవ్వడూ తనవద్ద తనురాసిన ఆ బ్లాక్‌మెయిల్ తాలూకు ఉత్తరాల నకళ్ళనుకాని, ఆ ఉత్తరాలకు వచ్చిన సమాధానాలనుకాని చక్కగా ఫైల్‌చేసి ఉంచుకోడు. ఐతే, మీ నాన్నగారు అలా ఎందుకు చేశారు? ఆ ఉత్తరాలమూలంగా తనను అహమ్మద్ అనేవ్యక్తే హత్యచేసి ఉండాలని అందరూ నమ్మడానికి.

"నిన్న సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో మా నాన్నగారు మీ ఇంటికి అహమ్మద్ వేషంలో వచ్చారు. అప్పుడు ఆయన తెచ్చిన సంచీలో కొన్ని వంద రూపాయల నోట్లకట్టలనూ, బ్రాందీ సీసాలనూ మీ నౌకరు చూసేలాచేయడం కూడా ఆయన ప్లానులోని ఒకఅంశమే. నౌకరు అన్నం తేవడానికి వెళ్ళగానే ఆయనకూడా ఇంట్లోంచి చల్లగా జారుకున్నారు. తర్వాత ఆయన ఎక్కడో ఆపివచ్చిన మీ కారులో తిన్నగా మీ ఊరికి ఐదుమైళ్ళ దూరంలోఉన్న ఆ లెవెల్ క్రాసింగ్ వద్దకు చేరుకున్నారు. మెయిల్ ట్రెయిన్ అక్కడికి చేరుకోడానికి కొన్ని నిమిషాలముందు ఆయన కారును సరిగ్గా పట్టాలమీదికి తీసుకువచ్చి నిలిపారు. తర్వాత ఆయన ఆ కారులోనే బ్రాందీని తప్పతాగి, కాస్సేపటికి దుర్మరణం పాలయ్యారు. హత్య జరిగిన సమయానికి మీరు ఊళ్లోఉంటే, మీరే భీమాడబ్బుకు ఆశపడి మీ నాన్నగారిని హత్యచేశారని అనుమానించడానికి వీలవుతుందని మీరు ఢిల్లీకి ప్రయాణమయ్యేటట్లు చేశారు.

"ఆయన కారులో కూర్చోడానికి ముందు అహమ్మద్ వేషానికని ఆయన ధరించిన గడ్డం, మీసాలను, లుంగీని తీసేసి, అవి మాత్రం ఎవ్వరికీ కనబడకుండా ఉండేలా ఏ ప్రదేశంలోనో దాచి పెట్టిఉండొచ్చు. షర్టునుమాత్రం అక్కడక్కడ చించారు—ఆయనకూ,ఆయన్ని చంపడానికి వచ్చిన అహమ్మద్‌కూ పోట్లాట జరిగిఉండాలని మనం భావించడానికి. అందుకనే ఆయన చనిపోవడానికి ముందు మామూలు పానకాలు వేషంలో ధరించిన షర్టుకూడా అక్కడక్కడ చిరిగిఉంది. అటుపైన ఆయన ఇగ్నిషన్ కంట్రోల్‌ను ఆపుచేసి, కారులోంచి బీగాన్ని తీసి, అహమ్మద్ వేషంలో తొడుక్కున్న ఈ చుక్కల షర్టులోఉంచి, ఈ షర్టుమాత్రం బాగా కనిపించేలా ముళ్ళపొదల ముందు ఉంచారు. కాని, మీ నాన్నగారు ఆ హడావిడిలో షర్టును విప్పడంమూలంగా ఆయన వొంటిమీదున్న జందెంపోగు కూడా ఆ షర్టుతోపాటు బయటకు వచ్చేసింది. నేనిందాక ఆ షర్టులో చిక్కుకొనిఉన్న యజ్ఞోపవీతాన్నిచూసినప్పుడే నాకు చాలా విచిత్రంగా తోచింది. మరి అహమ్మద్ ముస్లింకదా—అతను విప్పి పారేసిన షర్టులో యజ్ఞోపవీతం ఎలా ఉంటుంది?" అన్నాడు చాణక్య.

ఆ టేబుల్‌మీద పడున్న చుక్కల చొక్కాను అందుకొని, అందులోఉన్న యజ్ఞోపవీతాన్ని గిరి బయటకు తీసి చూస్తూండగా అతని కనుకొలకుల్లో రెండు అశ్రుబిందువులు ఉద్భవించాయి.

